

సూర్యప్రభ వాహనంపై మలయప్ప



సూర్యప్రభ వాహనంపై ఊరేగుతున్న శ్రీమలయప్ప స్వామివారు

ప్రజాశక్తి- తిరుమల: తిరుమల శ్రీ వేంకటేశ్వర స్వామివారి నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ఏడో రోజైన శనివారం ఉదయం శ్రీ మలయప్ప స్వామివారు సూర్యప్రభ వాహనంపై భక్తులను కటాక్షించారు. వాహనం ముందు గజరాజులు రాజసంతో నడుస్తుండగా, భక్తజన బందాలు భజనలు, కోలాటాలు, జీయ్యంగార్ల ఘోష్టితో స్వామివారిని కీర్తిస్తుండగా, మంగళవాయిద్యాల నడుమ స్వామివారి వాహనసేవ కోలాహలంగా జరిగింది. విశేషంగా విచ్చేసిన భక్తులు అడుగడుగునా కర్పూరహారతులు సమర్పించి శ్రీవారిని దర్శించుకున్నారు.

సూర్యప్రభ వాహనం - ఆయురారోగ్యప్రాప్తి

సూర్యుడు సకలరోగ నివారకుడు, ఆరోగ్యకారకుడు, ప్రకతికి చైతన్యప్రదాత. ఔషధీపతి అయిన చంద్రుడు కూడా సూర్యతేజం వల్లనే ప్రకాశిస్తూ వద్ధి పొందుతున్నారు. ఈ ఉత్సవంలో శ్రీవారి చుట్టూ ఉన్న సూర్యప్రభ సకల జీవుల చైతన్యప్రభ, సూర్యమండల మధ్యవర్తి శ్రీమన్నారాయణుడే. అందుకే సూర్యున్ని సూర్యనారాయణుడు అని కొలుస్తున్నాం. సూర్యప్రభ వాహనంలో స్వామివారిని దర్శిస్తే ఇతోధిక భోగభాగ్యాలు, సత్సంతాన సంపదలు, ఆయురారోగ్యాలు సిద్ధిస్తాయి. ఈకార్యక్రమంలో శ్రీశ్రీశ్రీ పెద్దజీయర్‌స్వామి, శ్రీశ్రీశ్రీ చిన్నజీయర్‌స్వామి, టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఎవి.ధర్మారెడ్డి, పలువురు బోర్డు సభ్యులు, ఢిల్లీ స్థానిక సలహామండలి అధ్యక్షురాలు వేమిరెడ్డి ప్రశాంతి, జెఈవోలు సదా భార్గవి, వీరబ్రహ్మం, సివిఎస్వో నరసింహ కిషోర్ ఇతర అధికారులు పాల్గొన్నారు.

శ్రీవారిని దర్శించుకున్న వీవీఎస్ లక్ష్మణ్

టీమిండియా మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ తిరుమల శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకుని తిరుమలకు లక్ష్మణ్ వచ్చారు. శనివారం ఉదయం స్వామివారి నైవేద్య విరామ సమయంలో కుటుంబ సభ్యులతో కలిసి మాజీ క్రికెటర్ వీవీఎస్ లక్ష్మణ్ స్వామివారి సేవలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. శ్రీవారి దర్శనంతరం ఆలయ రంగనాయకుల మండపంలో వేద పండితులు వేద ఆశీర్వాదం అందించగా, ఆలయ అధికారులు పట్టువస్త్రంతో సత్కరించి స్వామి వారి తీర్ధ ప్రసాదాలు అందజేశారు. అనంతరం శ్రీవారి నవరాత్రి బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని శ్రీవారి ఆలయానికి విరాళం అందించారు. ఒక్కరోజు శ్రీవారి అలంకరణకు అయ్యే ఖర్చును వివిఎస్ లక్ష్మణ్ విరాళంగా అందించారు. దాదాపు 14 లక్షల రూపాయలను విరాళంగా ఇచ్చిన ఆయన, శ్రీవారి ఆలయంలో ధ్వజస్తంభం మొదలుకుని శ్రీవారి గర్భాలయం వరకూ టిటిడి ఉద్యానవనం సిబ్బంది వివిధ రకాల కట్‌ఫ్లవర్స్ అలంకరణను ఆలయంలో కుటుంబ సభ్యులతో కలిసి గమనించారు. తిరుమలకు వచ్చి శ్రీవారిని దర్శించుకోవడం సంతోషంగా ఉందన్నారు.

'గగన్‌యాన్' టివి-డి1

ప్రయోగం విజయవంతం

ప్రజాశక్తి- సూళ్లూరుపేట: భారత అంతరిక్ష పరిశోధన సంస్థ చంద్రయాన్-3, ఆదిత్య-ఎల్1 ప్రయోగ విజయాలతో రెట్టింపు ఉత్సాహంతో సరికొత్త ప్రయోగానికి నాంది పలికింది. సతీష్ ధావన్ స్పేస్ సెంటర్ నుంచి ఉదయం 8.45 నిమిషాలకు ప్రయోగించాలనుకున్న టీవీ డి1 రాకెట్ పైకి లేవకపోవడంతో ప్రయోగాన్ని వాయిదా వేసినట్లు షార్ అధికారవర్గాలు తెలియజేశాయి. ఆటోమేటిక్ లాంచ్ సీక్వెన్స్‌లోని ఆన్ బోర్డ్ కంప్యూటర్ ప్రయోగాన్ని ఆపేసింది. కౌన్‌డౌన్ సమయం పూర్తయినప్పటికీ రాకెట్టు ప్రయోగాన్ని ఆపేశారు. సాంకేతిక లోపంతో అనుకున్న సమయానికి రాకెట్ ప్రయోగం చేయలేకపోయారు. ఆ లోపాన్ని సరిచేసి శనివారం ఉదయం 10గంటలకు ప్రయోగాన్ని విజయవంతం చేశారు. 1 గంట 15 నిమిషాలు లేటుగా ప్రయోగం చేసి విజయవంతం చేశారు. భవిష్యత్‌లో జరిగే మానవ సహిత రాకెట్ ప్రయోగాల కోసం జరిపే పరిశోధనల్లో భాగంగా మానవ రహిత కమాడ్యులును ప్రయోగించారు. శ్రీహరికోట రాకెట్ ప్రయోగ కేంద్రంలోని మొదటి ప్రయోగ వేదికపై నుండి టెస్ట్ వెహికల్ టీవీ డి1 రాకెట్ ద్వారా కమాడ్యూల్‌ను ప్రయోగించడం విజయవంతం చేశారు. 4520 కిలోల బరువు కలిగిన కమాడ్యూల్ ప్రయోగం అనంతరం 17 కిలోమీటర్లు ఎత్తు వరకు వెళ్లి అక్కడ నుండి ప్యారాచూట్ల సహాయంతో శ్రీహరికోటకు సరిగ్గా 10 కిలోమీటర్ల దూరంలో బంగాళాఖాతం సముద్రంలో పడిపోవడం జరిగింది. నేవీ వారి సహాయంతో తిరిగి మాడ్యూల్‌ను వెనక్కు తీసుకురావడం జరిగింది. అంటే భవిష్యత్‌లో ఇలాంటి మాడ్యూళ్లలో మనుషులను పెట్టి పైకి పంపడం జరుగుతుంది. అవి తిరిగి సురక్షితంగా భూమి మీదకు చేరుకునేలా పరీక్షల నిమిత్తం ఈ ప్రయోగాన్ని ఇస్రో నిర్వహించడం జరిగింది. ఇలాంటి ప్రయోగాలు విజయవంతమైతే అంతరిక్ష పర్యటనలు సులభతరం అవుతుంది.



ఆకాశంలోకి దూసుకెళుతున్న కృమాడ్యూల్

బంగాళాఖాతంలో పడిన మాడ్యూల్‌ను తిరిగి తీసుకువస్తున్న నేవీ

ఈవీఎం, ఎఫ్ఎల్‌సి

ప్రక్రియ ఏర్పాట్లు భేష్

ఎఫ్ఎల్‌సి ప్రక్రియ పరిశీలనా నోడల్ అధికారి వి.రాఘవేంద్ర

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: భారత ఎన్నికల కమిషన్ వారిచే ఓటింగ్ యంత్రాల ఎఫ్ఎల్‌సి ప్రక్రియ పరిశీలన కొరకు జిల్లాకు కేటాయించబడిన జాయింట్ ఛీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, కర్ణాటక, ఎఫ్ఎల్‌సి ప్రక్రియ పరిశీలనా నోడల్ అధికారి వి.రాఘవేంద్ర, తిరుపతి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె.వెంకట రమణ రెడ్డితో కలిసి రేణిగుంట వద్ద సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పోరేషన్ గోడౌన్‌లో భద్రపరచబడిన ఈవిఎంలను అక్కడ జరుగుతున్న ఎఫ్ఎల్‌సి ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. శనివారం ఉదయం భారత ఎన్నికల కమిషన్ వారిచే ఈవిఎంల ఎఫ్ఎల్‌సి ప్రక్రియ పరిశీలన కొరకు జిల్లాకు కేటాయించబడిన జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, కర్ణాటక, ఈవిఎం ఎఫ్ఎల్సి పరిశీలనా నోడల్ అధికారి జిల్లా కలెక్టర్‌తో కలిసి రేణిగుంట వద్ద సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్‌లో భద్రపరచబడిన ఈవిఎంల ఎఫ్ఎల్‌సి ప్రక్రియను పరిశీలించారు. ఈవిఎం ఎఫ్ఎల్‌సి పరిశీలనా నోడల్ అధికారికి జిల్లా కలెక్టర్ ఎఫ్ఎల్సీ ప్రక్రియ ఏర్పాట్లను వివరించారు. నోడల్ అధికారి వారు బెల్ ఇంజినీర్లతో ఈవిఎంల పనితీరును తనిఖీ చేస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి సందేహాలను నివత్తి చేసి పలు సూచనలు చేశారు. అలాగే ఈవిఎం గోడౌన్‌ను పరిశీలించారు. నిర్వహిస్తున్న విజిటర్స్ రిజిష్టర్, భద్రత ఏర్పాట్లను తదితరాలను పరిశీలించారు. ఎఫ్ఎల్సీ తనిఖీ అనంతరం మాట్లాడుతూ తాను భారత దేశంలోని పలు ప్రాంతాల్లో ఈవిఎం ఎఫ్ఎల్సీ ప్రక్రియ ఏర్పాట్లను చూశానని, తిరుపతి జిల్లాలో ఎఫ్ఎల్సీ ప్రక్రియ ఏర్పాట్లు బాగున్నాయని చక్కగా నిబంధనల మేరకు ఉన్నాయని కలెక్టర్‌ను అభినందించారు. కార్యక్రమంలో ఈవీఎంల నోడల్ అధికారి కోదండరామి రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐఎన్‌సి చిరంజీవి, సిపిఐ (ఎం) సెల్వరాజ్, ఆమ్ ఆద్మీ పార్టీ డాక్టర్ వెంకట రమణ, రేణిగుంట తహశీల్దార్ ఉదయ సంతోష్, ఎలక్షన్స్ తహశీల్దార్ సురేష్, డిఎస్పీ, భద్రతా సిబ్బంది పాల్గొన్నారు.

ఈవీఎంల పరిశీలిస్తున్న కర్ణాటక ఎన్నికల అధికారి , కలెక్టర్

తిరుపతి అభివృద్ధికి అడ్డంగా మారిన

బిజెపి తీరును వ్యతిరేకించండి!

వామపక్ష నేతల పిలుపు

తిరుపతి అభివృద్ధి నిధులపై మాట్లాడుతున్న నేతలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: తిరుపతి అభివృద్ధి కోసం సంవత్సరానికి ఒక శాతం నిధుల కేటాయించాలని టీటీడీ పాలకమండలి చేసిన నిర్ణయం మనకందరికీ విధితమే. ఈనిధులు కేటాయింపుపై బిజెపి అడుగడుగునా అడ్డుకుంటుందని, బిజెపి తీరును తిరుపతి ప్రజలు వ్యతిరేకించాలని శనివారం యశోదనగర్‌లోని సిపిఎం కార్యాలయంలో జరిగిన ప్రెస్‌మీట్ కార్యక్రమంలో సిపిఎం, సిపిఐ పార్టీ నేతలు పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ జిల్లా కార్యదర్శి పి.మురళి మాట్లాడుతూ తిరుపతి అభివద్ధికి టీటీడీ నిధులు కేటాయించడం సరైందికాదని రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించడం అన్యాయమన్నారు. బిజెపి ఒత్తిడికి రాష్ట్ర ప్రభుత్వంలోనై ఈ నిర్ణయం చేసిందని విమర్శించారు. విభజన హామీలను అమలు చేయకుండా, రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా, వెనుకబడిన ప్రాంతాలకి ప్యాకేజీలు ప్రకటించకుండా రాష్ట్రానికి బిజెపి ద్రోహం చేసిందని విమర్శించారు. అభివృద్ధి నిరోధకులుగా బిజెపి వైఖరి స్పష్టంగా కనపడుతుందన్నారు. తిరుపతి అభివృద్ధిని అడ్డుకోవాలని పదేపదే బిజెపి కుట్రలకు పాల్పడుతుందని, ఈ కుట్రలను తిరుపతి ప్రజలు తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. బిజెపి వైఖరిని అన్ని రాజకీయ పార్టీలు, ప్రజాసంఘాలు, మేధావులు వ్యతిరేకించాలన్నారు. తిరుపతి అభివృద్ధి కోసం టీటీడీ నిధులు కేటాయించే వరకు వివిధ ఆందోళన కార్యక్రమాలను చేపడుతామని పేర్కొన్నారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గసభ్యులు కందారపు మురళి, నగర కార్యదర్శి టీ.సుబ్రహ్మణ్యం, నాయకులు వేణు, మునిరాజా, రాధాకృష్ణ, తంజావూరు మురళి, అక్బర్, రవి, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, రవి, శ్రీరాములు, రాజా పాల్గొన్నారు.

టీటీడీ సదుపాయాలను ఉపయోగించుకోండి

ఆర్జిత సేవ టికెట్ల భక్తుల పిటిషన్ పై హైకోర్టు డివిజన్ బెంచ్ ఆదేశం

ప్రజాశక్తి- తిరుమల: కోవిడ్-19 సమయంలో ఆర్జిత సేవ టికెట్లు బుక్ చేసుకున్న భక్తులకు ప్రస్తుతం అవకాశం కల్పించాలని హైకోర్టు సింగిల్ బెంచ్ ఇచ్చిన ఉత్తర్వులను డివిజన్ బెంచ్ కొట్టివేసింది. ఆ సమయంలో ఆర్జిత సేవ టికెట్లు బుక్ చేసుకున్న మిగిలిన భక్తులకు కల్పించిన సదుపాయలనే ఉపయోగించుకోవాలని పిటిషనర్లను ఆదేశించింది. కోవిడ్-19 వ్యాప్తి నేపథ్యంలో టీటీడీ భక్తులకు శ్రీవారి దర్శనం రద్దు చేసిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా మేల్ చాట్ వస్త్రం, అభిషేకం సహా ఇతర ఆర్జిత సేవలను కూడా రద్దు చేసింది. ఆర్జిత సేవ టికెట్లు అడ్వాన్స్ బుకింగ్ చేసుకున్న భక్తులు టికెట్ సొమ్ము వెనక్కు తీసుకోవడమో, లేదా టీటీడీ కల్పించే దర్శనం సదుపాయం ఉపయోగించుకునే వీలు కల్పించింది. ఈ రకంగా సుమారు 16 వేల మంది భక్తులు ఆర్జిత సేవలో పాల్గొనలేక పోయారు. కొందరు టీటీడీ కల్పించిన దర్శనం చేసుకోగా, మరి కొందరు ఆర్జిత సేవ టికెట్ మొత్తం వెనక్కు తీసుకున్నారు. అయితే 16మంది భక్తులు తమకు ఆర్జిత సేవలో పాల్గొనేలా టీటీడీని ఆదేశించాలని హైకోర్టును ఆశ్రయించారు. కోవిడ్-19 ప్రమాదం ముగిసినందువల్ల పిటిషనర్లకు వారు బుక్ చేసుకున్న ఆర్జిత సేవలో పాల్గొనే అవకాశం కల్పించాలని సింగిల్ జడ్జి ఆదేశించారు. దీనిపై టీటీడీ డివిజన్ బెంచ్‌కు అప్పీల్ చేసింది. భక్తులు దశాబ్దాలకు ముందే ఆర్జిత సేవా టికెట్లు బుక్ చేసుకున్నందువల్ల పిటిషనర్లకు ఆర్జిత సేవలో పాల్గొనే అవకాశం కల్పించలేమని టీటీడీ స్టాండింగ్ కౌన్సిల్ డివిజన్ బెంచ్‌కు వివరించారు. ఈ వివరణతో ఏకీభవించిన న్యాయమూర్తులు టీటీడీ ఇచ్చిన రెండు సదుపాయాల్లో ఏదో ఒకటి ఉపయోగించుకోవాలని పిటిషనర్లకు సూచించింది. సింగిల్ జడ్జి ఇచ్చిన ఆదేశాలను కొట్టి వేసింది.

27న శ్రీకాళహస్తికి నారా భువనేశ్వరి రాక...!

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ జాతీయ అధ్యక్షుడు నారా చంద్రబాబు నాయుడు సతీమణి నారా భువనేశ్వరి ఈనెల 27వ తేదీ శుక్రవారం శ్రీకాళహస్తికి రానున్నట్లు ఇక్కడి టీడీపీ శ్రేణులకు సమాచారం అందింది. ఇందులో భాగంగా నారా భువనేశ్వరి శ్రీకాళహస్తీశ్వర స్వామిని దర్శించుకోనున్నారు. నారా భువనేశ్వరి శ్రీకాళహస్తి పర్యటన సమాచారం అందినా, ఇంకా అధికారికంగా ఖరారు కావాల్సి ఉందని టీడీపీ శ్రేణులు తెలిపాయి.

కేంద్ర ప్రభుత్వ పథకాల అమలుపై దిశానిర్దేశం

ప్రజాశక్తి- తిరుపతి బ్యూరో: కేంద్ర ప్రభుత్వం పేదప్రజల సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపడుతోందని అన్ని రాష్ట్రాలు వాటిని ప్రజలకు చేర్చటంలో అత్యంత ముఖ్యభూమిక పోషిస్తున్నాయని కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణ అభివద్ధి శాఖ మంత్రి గిరిరాజ్ సింగ్ అన్నారు. తిరుపతి పర్యటన సందర్భంగా తన శాఖకు చెందిన పంచాయతీ రాజ్, గ్రామీణ అభివద్ధి శాఖకు సంబంధించి రాష్ట్రంలో చేపడుతున్న పలు అంశాలపై సమీక్ష నిర్వహించి అధికారులకు దిశా నిర్దేశం చేశారు. శనివారం సాయంత్రం కేంద్ర మంత్రి, ఎంపీ గురుమూర్తి, మెంబర్ రాయుడుతో కలిసి రాష్ట్ర అధికారులతో సంబంధిత శాఖ అంశాలపై సమీక్షించారు. స్వామిత్వా కింద రాష్ట్రంలో గ్రామకంటాలు, వ్యవసాయ భూములు రీసర్వే సమాంతరంగా చేపడుతున్నామని, 17000 గ్రామాల్లో రీసర్వే చేపట్టడం జరిగిందని, సుమారు 13 వేల గ్రామాల్లో ఈసంవత్సరం డిసెంబర్ నాటికి డ్రోన్ ఫ్లై, ఇమేజింగ్ వంటివి పూర్తి అవుతాయని, 4 వేల దాకా గ్రామాల్లో పూర్తి స్థాయిలో రీసర్వే జరిగి హక్కు పత్రాలు అందచేసామని వాటిని సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయాలకు లింక్ చేయడం జరిగిందనీ సర్వే, లాండ్ రికార్డ్స్ కమిషనర్ మంత్రికి తెలిపారు. మంత్రి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 7లక్షల ఎస్‌హెచ్‌జిలు అందరూ ఆయుష్మాన్ భారత్ కింద కవర్ అయ్యారని తెలిసి సంతోషించారు. ప్రధాన మంత్రి మోడీ ప్రభుత్వం కన్నా ముందు బ్యాంక్ లింకేజి తక్కువగా, ఎన్పిఏ ఎక్కువగా ఉండేదని నేడు బ్యాంక్ లింకేజీ లక్షల కోట్ల రూపాయలు ఇప్పటికే అందించామని, ఎన్పిఏ 1.7 శాతానికి తగ్గిపోయిందని తెలిపారు. ప్రతి కుటుంబానికి నెలకు 10 వేలకు తక్కువ కాకుండా ఉండేలా నరెగ, ఎన్‌ఆర్‌ఎల్‌ఎం కలిపి పేద కుటుంబానికి అందేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. పొదుపు సంఘాలకు సక్రమంగా తిరిగి కట్టిన వారికి సిబిల్ స్కోర్ తెలిసేలా వారికి తిరిగి ఇచ్చే రుణాలు స్కేల్ ఆఫ్ ఫైనాన్స్ ప్రకారం అందించాలని సూచించారు. అనంతరం కేంద్ర మంత్రిని ఎంపీ, రాష్ట్ర అధికారులు సన్మానించారు. ఈ సమీక్షలో సర్వే, లాండ్ రికార్డ్స్ కమిషనర్ సిద్ధార్థ్ జైన్, కమిషనర్ పంచాయతీరాజ్ సూర్య కుమారి స్పెషల్ కమిషనర్ పంచాయతీ సిరి డైరెక్టర్ నరేగా చిన్న తాతయ్య డైరెక్టర్, జెసి డికె బాలాజీ, వాటర్ షెడ్స్ వెంకటరెడ్డి ఈఎన్సి పంచాయతీరాజ్ బాలు నాయక్, రాష్ట్ర, ఉమ్మడి చిత్తూరు జిల్లా అధికారులు పాల్గొన్నారు.

గవర్నర్‌కు ఘనస్వాగతం

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్‌కి ఘనస్వాగతం లభించింది. జిల్లా కలెక్టర్ కె.వెంకట రమణా రెడ్డి, ఎస్పి పరమేశ్వర రెడ్డి, అడిషనల్ ఎస్పి కులశేఖర్, ఆర్‌డిఓ కనకనరసా రెడ్డి, డిప్యూటి కలెక్టర్‌లు భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు, రేణిగుంట తహశీల్దార్ ఉదయ సంతోష్, డిఎస్‌పి భవ్య, స్వాగతం పలుకగా విమానాశ్రయంలో ఏర్పాట్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. అనంతరం గవర్నర్ రోడ్డు మార్గాన తిరుమల బయలుదేరి వెళ్లారు. నేటి రాత్రి తిరుమలలో బసచేసి ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం 12 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకొని బెంగళూరు వెళ్లనున్నారు.



గవర్నర్‌కు స్వాగతం పలుకుతున్న టిటిడి ఛైర్మన్, ఈవో

తిరుమలకు చేరుకున్న గవర్నర్

ఆంధ్రప్రదేశ్ గవర్నర్ అబ్దుల్ నసీర్ శనివారం సాయంత్రం తిరుమల చేరుకున్నారు. రచన విశ్రాంతి గహానికి చేరుకున్న ఆయనకు టీటీడీ ఛైర్మన్ భూమన కరుణాకరరెడ్డి, ఈవో ఏవీ ధర్మారెడ్డి, ఇతర అధికారులు స్వాగతం పలికారు.

భూముల రీసర్వే పారదర్శకంగా జరగాలి

సీసీఎల్ఏ సిద్ధార్థ జైన్

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి

రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న భూముల రీసర్వే కార్యక్రమం పారదర్శకంగా సాగాలని ల్యాండ్ అడ్మినిస్ట్రేషన్ చీఫ్ కమిషనర్ సిద్ధార్థ జైన్ సంబంధిత అధికారులకు సూచించారు. శనివారం ఆయన జెసి బాలాజీతో కలిసి స్థానిక శ్రీకాళహస్తి తహశీల్దార్ కార్యాలయంలో భూముల రీసర్వేపై సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆ మండలంలో జరుగుతున్న భూముల రీ సర్వేపై ఆరా తీశారు. రికార్డులను పరిశీలించారు. బోరవానిపల్లిలో పూర్తయిన భూముల రీ సర్వే కార్యక్రమాన్ని పరిశీలించి సంతృప్తిని వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి మండలంలో 61 రెవెన్యూ గ్రామాలు ఉండగా, ఇప్పటివరకు 9 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీ సర్వే కార్యక్రమం పూర్తయినట్లు చెప్పారు. ఏపీపురం, అమ్మచెరువు, అమ్మపాలెం, బీవీపురం, బోరవానిపల్లి, ముద్దు మూడి, మంగళగిరి, పెనుబాక రెవెన్యూ గ్రామాల్లో రీసర్వే కార్యక్రమం పూర్తయిందన్నారు. అదేవిధంగా తొట్టెమ్మడి మండలంలో 41 రెవెన్యూ గ్రామాలకు గానూ, 10 రెవెన్యూ గ్రామాల్లో భూముల రీసర్వే శరవేగంగా సాగుతుండగా, సిద్దిగుంట, మామిడి గుంట, దొంగలమూడూరు రెవెన్యూ గ్రామాల్లో పూర్తయిందని చెప్పారు. డిఐ గురవయ్య, తహశీల్దార్ ద్వారకానాథ్ రెడ్డి, ఆర్ఐలు దివాకర్, భాస్కర్ పాల్గొన్నారు.

కనకదుర్గకు ముక్కంటి సారె

పజాశక్తి-శ్రీకాళహస్తి : విజయవాడలోని ఇంద్రకీలాద్రిపై వెలసిన కనకదుర్గ అమ్మవారికి శనివారం శ్రీకాళహస్తీశ్వర ఆలయం తరపున సారె అందజేశారు. శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా ప్రతి యేటా కనకదుర్గ అమ్మవారికి శ్రీకాళహస్తీశ్వర ఆలయం తరపున సారె అందజేయడం ఆనవాయితీ. ఇందులో భాగంగా ఈ ఏడాది కూడా అమ్మవారికి సారె అందించారు. శ్రీకాళహస్తి నుంచి సారె తీసుకెళ్లిన ధర్మకర్తల మండలి సభ్యులకు, అధికారులకు కనకదుర్గ ఆలయ ఈవో కేఎస్ రామారావు స్వాగతం పలికి ఆలయ సాంప్రదాయాలతో సారె స్వీకరించారు. సారె తీసుకెళ్లిన వారికి అమ్మవారి శేష వస్త్రంతో సన్మానించి తీర్థ ప్రసాదాలు అందజేశారు. ధర్మకర్తల మండలి అధ్యక్షులు అంజూరు తారక శ్రీనివాసులు, ఆలయ ఈవో కేవీ సాగర్ బాబు, సభ్యులు పాల్గొన్నారు.

- సనాతన పేరుతో మహిళలపై పెత్తనం
- ధ్వజమెత్తుతున్న నారీ లోకం

ఆమోదం సరే.. అమలేదీ..?

ప్రజాశక్తి- తిరుపతి సిటి

ప్రజాదృష్టి

కేంద్రంలో అధికారంలో ఉన్న ఆర్‌ఎస్‌ఎస్- బిజెపి ప్రభుత్వం సనాతన ధర్మం మాటున మహిళలను వంటింటికే పరిమితం చేస్తూ, స్త్రీలపై పెత్తనం చలాయించేందుకు పూనుకుందని, నారీలోకం ధ్వజమెత్తుతోంది. చట్టసభల సాక్షిగా మోడి ప్రభుత్వం మహిళలపై వివక్షతన ప్రదర్శించింది. ఓటు బ్యాంకు రాజకీయాలకు పాల్పడుతున్న పురషాహంకార పాలకులకు రాబోవు ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతామని మగువలు నడుం బిగించారు. తిరుపతి కేంద్రంగా జరిగిన రెండు మహిళా సదస్సుల ద్వారా అతివలు వారి ఆవేదనను తెలియజేస్తూ, స్త్రీలోకం చైతన్యశంఖం పూరించింది.

ఒకవైపు మహిళలను దేవతలుగా పూజిస్తూన్నామని చెబుతూ, మరోకవైపు నఃస్త్రీ స్వాతంత్రం నర్హతి అని పాటిస్తూ, ప్రస్తుతం నగ్న ఊరేగింపులు, దారుణ హత్యల పట్ల మాటవరుసకు సైతం సానుభూతి తెలియజేయకపోవడం మహిళ పట్ల పాలకులకు, సమాజంలో ఉన్న భావజాలానికి ప్రతీకగా నిలుస్తున్నది. ఆ కాలకంలో మహిళలకు స్వేచ్ఛ ఉండేదని, దండయాత్రలు చేసి దేశాన్ని ఆక్రమిమించి పరాయి పాలకులు వచ్చిన తర్వాతనే సంకెళ్లు విధించారని చెబుతున్నారు. ఇది నిజమే అయితే 18వ శతాబ్దిలో సావిత్రిబాయి పూలే పాఠశాలను స్థాపించి మహిళలకు చదువు చెప్పేదాక ఆడవారిని ఇంటికే ఎందుకు పరిమితం చేశారో చెప్పాలి.

దేశంలో, రాష్ట్రంలో మహిళలపై హింస పెరుగుతున్నది. ఉపాధి అవకాశాలు తగ్గిపోతున్నాయి. చేసిన పనికి గుర్తింపు ఉండదు. ప్రభుత్వ ఉద్యోగాల్లో మినహా అన్నిరంగాల్లో హీనమైన వేతనాలే. అధికారంలో ఉన్న ప్రభుత్వాలు కంటి తుడుపు చర్యలు తప్ప సమస్యల పరిష్కారానికి సరైన విధానం లేదు. పైగా సాధించుకున్న హక్కులను సైతం హరిస్తున్నారు. ఎన్నో మహిళా దినోత్సవాలు వస్తున్నాయి, వెళ్లిపోతున్నాయి. ఎన్నో మహిళా రక్షణ చట్టాలు చేస్తున్నారు. మహిళ ఉద్ధరణ కోసం పనిచేస్తామని చెప్పిన వాళ్లు అధికారంలోకి వస్తున్నారు. పోతున్నారు. ఒక దినోత్సవానికి, మరోక దినోత్సవానికి మధ్య మార్పు, అభివృద్ధి, మహిళలకు రక్షణఏమైనా ఉందా అంటే జవాబు చెప్పేవారవు లేరు. సాధించిందేమి కనిపించడం లేదు. అయినా... ఆడోళ్లకి విలువ ఏమిటి? చదువుకుని ఊళ్లేలాలా...? అందంగా ఉంటారని బరితెగించి మాట్లాడేవారు ఇంకా ఉన్నారు. నిజమే ఊపిరి పోసి, మాటలను నేర్పిన అమ్మతనాన్ని మాటలతో చేష్టాలతో కించపరుస్తూ ఉంటే అలా ముందుగానే కించపరుస్తారని ఊహించిన ఆ తల్లి ఊపిరి పోసుకుంటున్నప్పుడే ఊపిరి తీసి ఉంటే వీరు ఉండేవారా? సనాతన ధర్మం పేరుతో మనస్మృతిని అమలు చేసేందుకు పథకం వేసిన నేటి పాలకులు ఒకసారి ఆలోచించాలి.

మహిళలపై హింస

మహిళలపై, పసిబిడ్డలపై అత్యాచారాలు ఆంధ్రరాష్ట్రంలో ఆందోళనకర స్థాయిలో పెరుగుతూనే ఉన్నాయి. మహిళలపై సాగుతున్న అత్యాచారాలను అరికట్టేందుకు త్వరితగతిన విచారణ చేసేందుకు ప్రభుత్వం తీసుకున్న దిశ చట్టం అమలకు నోచుకోవడం లేదు. పరిస్థితి రోజురోజుకి క్షీణిస్తోంది. ఎన్‌సిఆర్‌బి లెక్కల ప్రకారం 2020-21లో రాష్ట్రంలో మహిళలపై అత్యాచారాలు 25శాతం పెరిగాయి. వాస్తవంగా జరుగుతున్న అత్యాచార ఘటనలను ఫిర్యాదు చేయడానికి, కేసులు పెట్టడానికి 90శాతం మంది ప్రజలు ముందుకు రావడంలేదని ఎన్‌హెచ్‌ఎస్ సర్వే తేల్చి చెప్పింది. దిశ యాప్‌కు 25,554 కేసులు ఫిర్యాదులు అందితే, అందులో 10శాతం అంటే 2,524 కేసులకు మాత్రమే ఎఫ్ఐఆర్ నమోదు అయ్యాయి. అవి కూడా విచారణ దీర్ఘకాలంగా కొనసాగుతూనే ఉన్నాయి. సాక్షాత్తు దేశ ప్రథమ పౌరురాలి పట్లే వివక్షత సాగింది. పార్లమెంట్ కొత్త భవన ప్రారంభానికి కనీసం ఆహ్వానం కూడా అందించలేది నేటి సనాతన ధర్మం పేరుతో పాలన సాగిస్తున్న బిజెపి- ఆర్‌ఎస్‌ఎస్ ప్రభుత్వం, సాక్షాత్తు రాష్ట్ర మహిళా మంత్రి పట్ల మాజీ మంత్రి మీడియా వ్యక్తిగత దూషణలకు దిగిన ఘటన బాధాకరం. సర్పంచ్‌లు, ఎంఎల్‌ఏలు, ఎంపిలు, ఎంపిపిలు, కేంద్ర, రాష్ట్ర మంత్రులకే కాదు సాక్షాత్తు రాష్ట్రపతి స్థానంలో ఉన్న వారికి కూడా వివక్షత తప్పడం లేదు. బూర్జువ రాజకీయ పార్టీల పాలనలో పరిస్థితి ఇంత దారుణంగా దిగజారిపోయింది. ఆఖరికి మహిళలను అత్యాచారాలు చూసి, నగ్నంగా ఊరేగించినా శిక్షించకపోగా, సాక్షాత్తు పాలకులే వారికి మద్దతుగా నిలబడ్డ విచిత్ర సంఘటనలు సరామామూలే. ఇంక వారికి రక్షణ ఎలా దొరుకుతుంది. ఆడవారిని ఉన్నతంగా చూడకపోయినా పర్వాలేదు. కనీసం మనిషిగా కూడా చూడని దౌర్భాగ్య స్థితి నెలకొంది. ఆఖరికి మొన్నటికి మొన్న పార్లమెంట్ కొత్తభవనంలో తూతూమంత్రంగా దశబాద్ధాల తరబడి నానుతున్న మహిళా బిల్లుకు ఆమోద ముద్ర వేశారు. (అది కూడా త్వరలో ఐదు రాష్ట్రల్లో జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికలు, దేశ వ్యాప్తంగా జరుగబోయే సాదారణ ఎన్నికల దృష్ట్యా). కానీ అందులోనూ తిరకాసు పెట్టారు. అది కూడా 2029 ఎన్నికల తర్వాత, అందులోనూ కేవలం 15సంవత్సరాలు మాత్రమే రిజర్వేషన్లు అమలయ్యేలా చర్యలు తీసుకున్నారు. ఇది కదా ఓటు బ్యాంకు రాజకీయం అంటే. కుటుంబానికి సర్వం దోచిపెట్టే మహిళల పట్ల నేటి పాలకులు తీరు ఇది. చట్టచభల్లో అమోదించిన చట్టాలను తక్షణం పకడ్బందీగా అమలయ్యేలా చూడాలి. ఇందుకు ఐద్వా ఆధ్వర్యంలో మహిళా లోకం నడుం బిగించింది. అసమానతలు లేని అభివృద్ధి కోసం ప్రజారక్షణ భేరి మ్రోగించింది. సంక్షేమ పథకాలు అందరికీ అందేవిధంగా అమలు చేసేందుకు, ఉపాధి కల్పనకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వా విధానాలు మారాలి, మహిళా సంక్షేమానికి సాధికారికత కృషి చేయాలంటూ దేశ వ్యాప్తంగా మహిళా సదస్సులు నిర్వహించి, స్త్రీలోకంలో చైతన్యం తీసుకొచ్చేందుకు పూనుకుంది. అందులో బాగంగా గత శని, ఆదివారాల్లో తిరుపతి కేంద్రంగా బారీస్థాయిలో మహిళలా సదస్సులు నిర్వహించి, నారీ లోకాన్ని చైతన్య పరిచింది. ఈపోరాటం దేశవ్యాప్తంగా విజృంబించి, సనాతన ధర్మం పేరుతో మహిళలను అణగదొక్కుతున్న పాలకుల మెడల వంచేలా సాగి, విజయవంతం కావాలని మహిళా లోకం కోరుకుంటోంది.

బిఎల్ఎం సిమెంట్ కంపెనీలో పరస్పర దాడులు

- పలువురి కార్మికులకు గాయాలు.. ఆస్పత్రికి తరలింపు

ప్రజాశక్తి -సత్యవేడు: సిమెంటు డస్ట్ పంటలపై పడుతోందని ఓ రైతు ప్రశ్నించడంతో అది చిలికి దాడుల వరకు వెళ్లింది. ఈ సంఘటన తిరుపతి జిల్లా సత్యవేడు మండలం తొండూరు గ్రామానికి సమీపంలో నడుస్తున్న బి ఎల్ఎం సిమెంటు కంపెనీ వద్ద శనివారం చోటు చేసుకుంది. బిఎల్ఎం సిమెంట్ కంపెనీకి పక్కనే కొందరు రైతులు పంటలను సాగు చేస్తున్నారు. ఈ నేపథ్యంలో సిమెంట్ తయారీ కంపెనీ నుంచి సిమెంటు ధూళి పంటలపై పడడంతో సంబంధిత రైతు మనికృష్ణయ్య ఆందోళనకు గురయ్యారు. ఈ క్రమంలోనే కంపెనీ వద్దకు వెళ్లి సిమెంట్ కంపెనీ నుంచి వెదజల్లుతున్న ధూళిపై అక్కడ కార్మికులను మనికృష్ణ నిలదీశారు. దీంతో కంపెనీలో పని చేస్తున్న తమిళనాడు పొదార్పేడు గ్రామానికి చెందిన కార్మికుడితో మనికృష్ణ వివాదం ఏర్పడింది. ఇరువురు మధ్య మాట మాట పెరగడంతో పరస్పర దాడులకు తెగబడి కొట్టుకున్నారు. దీంతో గాయపడ్డ అయితే మనికృష్ణయ్య గ్రామానికి చేరుకుని మళ్లీ కొందరు అనుచరులతో కంపెనీ వద్దకు వెళ్లి దాడులకు పాల్పడ్డారు. ఈ నేపథ్యంలోనే ఇరు గ్రూపులకు సంబంధించిన కొందరు గాయపడ్డారు. గాయపడ్డ కంపెనీకి సంబంధించిన కార్మికుల పలువురిని చికిత్స కోసం తమిళనాడు ఆస్పత్రికి తరలించినట్లు తెలిసింది. దీనిపై తొండూరు గ్రామానికి చెందిన బాధిత రైతు మనికృష్ణయ్య స్థానిక పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసినట్టు సమాచారం. అదే తరహాలో కంపెనీ యాజమాన్యం కూడా పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు ఇచ్చినట్లు తెలిసింది. ఏదేమైనా దీనిపై పోలీసు అధికారులు విచారించి బాధ్యులపై చర్యలు తీసుకోవాల్సి ఉంది.

ఎఫ్ఎల్సి ప్రక్రియ భేష్

కలెక్టర్ను ఈసిఐ ప్రతినిధి, ఈవిఎం ఎఫ్ఎల్సి పరిశీలన నోడల్ అధికారి ప్రశంస

ప్రజాశక్తి -రేణిగుంట: భారత ఎన్నికల కమిషన్ ఆదేశాలతో చేపట్టిన ఓటింగ్ యంత్రాల ఎఫ్ఎల్సి ప్రక్రియ నిబంధనల మేరకు సక్రమంగా నిర్వహిస్తున్నారని కలెక్టర్ కె వెంకటరమణారెడ్డిని ఈసిఐ ప్రతినిధి, ఈవిఎం ఎఫ్ఎల్సి పరిశీలన నోడల్ అధికారి వి రాఘవేంద్ర ప్రశంసించారు. ఓటింగ్ యంత్రాల ఎఫ్ఎల్సి ప్రక్రియ పరిశీలన నిమిత్తం జిల్లాకు నియమితులైన జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, కర్ణాటక ఎఫ్ఎల్సి ప్రక్రియ పరిశీలన నోడల్ అధికారి వి రాఘవేంద్ర తిరుపతి కలెక్టర్, జిల్లా ఎన్నికల అధికారి కె వెంకట రమణ రెడ్డి తో కలిసి రేణిగుంట వద్ద సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్ లో భద్రపరిచిన ఈవిఎంలను, అక్కడ జరుగుతున్న ఎఫ్ఎల్సి ప్రక్రియను పరిశీలించి పలు సూచనలు చేశారు. శనివారం ఈవిఎంల ఎఫ్ఎల్సి ప్రక్రియ పరిశీలన కోసం జిల్లాకు కేటాయించబడిన జాయింట్ చీఫ్ ఎలక్టోరల్ ఆఫీసర్, కర్నాటక ఈవిఎం ఎఫ్ఎల్సి పరిశీలన నోడల్ అధికారి రాఘవేంద్ర కలెక్టర్ తో కలిసి రేణిగుంట వద్ద సెంట్రల్ వేర్ హౌసింగ్ కార్పొరేషన్ గోడౌన్ లో భద్రపరిచిన ఈవిఎంఎఫ్ఎల్సి ప్రక్రియ ను పరిశీలించారు. ఈవిఎంఎఫ్ఎల్సి పరిశీలనా నోడల్ అధికారికి కలెక్టర్ ఎఫ్ఎల్సీ ప్రక్రియ ఏర్పాట్లను వివరించారు. నోడల్ అధికారి బెల్ ఇంజనీర్లతో ఈవిఎంల పనితీరును, తనిఖీ చేస్తున్న వివరాలు అడిగి తెలుసుకున్నారు. అక్కడే ఉన్న రాజకీయ పార్టీల ప్రతినిధులతో మాట్లాడి వారి సందేహాలను నివృత్తి చేసి పలు సూచనలు చేశారు. ఈవిఎం గోడౌన్ ను పరిశీలించారు. నిర్వహిస్తున్న విజిటర్స్ రిజిస్టర్, భద్రత ఏర్పాట్లను తదితరాలను పరిశీలించారు. ఎఫ్ఎల్సీ తనిఖీ అనంతరం మాట్లాడుతూ తాను భారత దేశంలోని పలు ప్రాంతాల్లో ఈవిఎం ఎఫ్ఎల్సీ ప్రక్రియ ఏర్పాట్లను చూశాను, తిరుపతి జిల్లాలో ఎఫ్ఎల్సీ ప్రక్రియ ఏర్పాట్లు బాగున్నాయని, చక్కగా నిబంధనల మేరకు ఉన్నాయని కలెక్టర్ ను అభినందించారు. ఈ కార్యక్రమంలో ఈవీఎం ల నోడల్ అధికారి కోదండరామి రెడ్డి, రాజకీయ పార్టీల ప్రతినిధులు ఐఎన్సి చిరంజీవి, సిపిఐ (ఎం) సెల్వరాజ్, ఆమ్ ఆద్మీ నాయకులు డాక్టరు వెంకటరమణ, రేణిగుంట తహశీల్దారు ఉదయ సంతోష్, ఎన్నికల నిర్వహణ తహశీల్దార్ సురేష్, డిఎస్పీ, భద్రతా సిబ్బంది, విధులు ఇర్వహిస్తున్న సిబ్బంది పాల్గొన్నారు.

ఈవిఎంల ఎఫ్ఎల్సి ప్రక్రియను పరిశీలిస్తున్న నోడల్ అధికారి వి రాఘవేంద్ర

గవర్నర్ కు ఘన స్వాగతం

ప్రజాశక్తి- రేణిగుంట: రెండు రోజుల పర్యటన నిమిత్తం శనివారం రాత్రి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర గవర్నర్ అబ్దుల్ నజీర్ కి ఘన స్వాగతం లభించింది. కలెక్టర్ కె.వెంకటరమణా రెడ్డి, ఎస్పి పరమేశ్వర రెడ్డి, అడిషనల్ ఎస్పి కులశేఖర్, ఆర్డీఓ కనక నరసా రెడ్డి, డిప్యూటీ కలెక్టర్లు భాస్కర్ నాయుడు, శ్రీనివాసులు, రేణిగుంట తహశీల్దారు ఉదయ సంతోష్, డిఎస్పీ భవ్య, స్వాగతం పలుకగా విమానాశ్రయంలో ఏర్పాట్లను రెవెన్యూ, పోలీస్ అధికారులు పర్యవేక్షించారు. అనంతరం రాష్ట్ర గవర్నర్ రోడ్డు మార్గంలో తిరుమల బయలుదేరి వెళ్లారు. నేటి రాత్రి తిరుమలలో బస చేసి, ఆదివారం ఉదయం తిరుమల శ్రీవారిని దర్శించుకుని మధ్యాహ్నం 12 గంటలకు రేణిగుంట విమానాశ్రయం చేరుకుని బెంగళూరు వెళ్లనున్నారు.

గవర్నర్కు స్వాగతం పలుకుతున్న కలెక్టర్, ఎస్పి



పోలీసు స్టేషన్ రికార్డులు పరిశీలిస్తున్న ఎస్పి పరమేశ్వర్రెడ్డి

పోలీసు స్టేషన్ రికార్డుల తనిఖీ

ప్రజాశక్తి- యర్రావారిపాలెం: మండల పోలీస్ స్టేషన్ను తిరుపతి ఎస్పి పి పరమేశ్వర్ రెడ్డి శనివారం తనిఖీ చేశారు. అనంతరం పోలీస్ స్టేషన్లో సీఐ సురేంద్రనాథ్ రెడ్డి, ఎస్ఐ ఈశ్వరయ్య, సిబ్బందితో సమావేశం ఏర్పాటు చేశారు. మండలంలో శాంతి భద్రతలు, క్రైమ్ కేసులు రికార్డులు మొదలైన సమస్యలు పరిశీలించారు. రానున్న ఎన్నికల గురించి, రాజకీయ పార్టీల నాయకుల గురించి అడిగి తెలుసుకొని దశ నిర్దేశం చేసి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు.

టీటీడీలో ఖాళీ ఉద్యోగాలు భర్తీ చేయాలి

ప్రజాశక్తి -రేణిగుంట : తిరుపతి తిరుమల దేవస్థానంలో ఖాళీగా ఉన్న ఉద్యోగాలను వెంటనే భర్తీ చేయాలని శనివారం బిసి విద్యార్థి సంఘర్షణ సంఘం రాష్ట్ర అధ్యక్షులు పూల వెంకటాద్రి యాదవ్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. టీటీడీలో ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ జారీ చేసి దాదాపు 15 సంవత్సరాలు అయిందని ఇటీవల కాలంలో యువత ఎంతగానో ఎదురుచూస్తున్నప్పటికీ నోటిఫికేషన్ ఇవ్వలేదని ఆయన పేర్కొన్నారు. టిటిడి అధికారులు, ముఖ్యమంత్రి చొరవ తీసుకొని వెంటనే టిటిడిలో ఉద్యోగాలకు నోటిఫికేషన్ జారీ చేయాలని ఈ సందర్భంగా డిమాండు చేశారు.

నిరుద్యోగులకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- రేణిగుంట : అమరరాజ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణ ఉపకార వేతనం (స్టైపెండ్)తో పాటు ఉద్యోగ అవకాశాలు కలవని అమరరాజ యాజమాన్యం తెలిపారు. అమరరాజా సంస్థ మద్దతుతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2014లో అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ని చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో స్థాపించారు. ఇప్పటి వరకు ఈ సంస్థ ద్వారా (14 బ్యాచ్ లు) 1314 మంది నిరుద్యోగ యువత తమ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఇలా ట్రైనింగ్ పూర్తి చేసుకొన్న 1314 మందికి అమరరాజ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగ అవకాశం కల్పించారు. ఇప్పుడు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో 18 బ్యాచ్ ల్లో 1370 మంది నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు. అమర రాజా స్కిల్ డెవలప్మెంటు సెంటర్ లో 10వ తరగతి పాస్ ఫెయిల్ లేదా ఇంటర్ పాస్ ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతి యువకులు కి (33వ బ్యాచ్) అడ్మిషన్స్ జరుగుతున్నాయి. ఎంపికైన విద్యార్థులకు శిక్షణా కాలంలో మొదటి 03 నెలలు నెలకు రూ 7500 లు, తదుపరి 21 నెలలు రూ. 11453 నుండి రూ 11853 వరకు ఉపకార వేతనం (స్టైపెండ్) ఇవ్వనున్నారు. 33వ బ్యాచ్ అడ్మిషన్లు 26 అక్టోబర్ 2023 నుండి ప్రారంభం అవుతాయన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఇతర వివరాలకు 9000024919, 9100477371 సంప్రదించాలని కోరారు.

25న రవిశంకర్ రెడ్డి బాధ్యతలు స్వీకరణ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: శ్రీకాళహస్తి ఆర్డీవోగా నియమితులైన రవిశంకర్ రెడ్డి ఈ నెల 25వ తేదీ బాధ్యతలు తీసుకునే అవకాశం వుంది. కడప జిల్లా భూసేకరణ విభాగం స్పెషల్ కలెక్టరు వద్ద పీఏ పని చేస్తున్న రవిశంకర్ రెడ్డిని శ్రీకాళహస్తి ఆర్డీవోగా నియమిస్తూ రాష్ట్ర ప్రభుత్వం గురువారం ఉత్తర్వులు జారీ చేసిన సంగతి తెలిసిందే. రవిశంకర్ రెడ్డి కడపలో తన విధుల నుంచి ఇంకా రిలీవ్ కాలేదు. కడపలో కలెక్టరు అందుబాటులో లేకపోవడంతో రవిశంకర్ రెడ్డి రిలీవ్ కాలేదని తెలిసింది. ఇక వరుసగా నాలుగు రోజులు సెలవులు ఉన్నందున 25వ తేదీ రవిశంకర్ రెడ్డి శ్రీకాళహస్తికి వచ్చి విధుల్లో చేరవచ్చని సమాచారం.

వెంకటేశ్వర స్వామికి చంద్రప్రభ వాహనం అందజేత

ప్రజాశక్తి-ఏర్పేడు : మండలంలోని వికృతి మాల గ్రామంలోని సంతాన వెంకటేశ్వర స్వామి ఆలయానికి చంద్రప్రభ వాహనాన్ని బాపూజీ విద్యాసంస్థల అధినేత వేమూరి బాలాజీ నాయుడు కుటుంబ సభ్యులు విరాళంగా అందజేశారు. శనివారం స్వామివారి ఉత్సవమూర్తిని చంద్రప్రభ వాహనంపై వికృతమాలలో ఊరేగించారు. ఈ కార్యక్రమంలో సంతాన వెంకటేశ్వర స్వామి ఆలయ ధర్మకర్త డాక్టర్ పసుపులేటి హరిప్రసాద్, దాత వేమూరి బాలాజీ నాయుడు, కుటుంబ సభ్యులు, పూల హేమాక్షి, బి మురళి, ఆర్ జనార్ధన్, మురికి కృష్ణయ్య పాల్గొన్నారు.

అమరరాజ స్కిల్ డెవలప్మెంట్లో

నిరుద్యోగ యువతకు ఉచిత శిక్షణ

ప్రజాశక్తి- రేణిగుంట : అమరరాజ స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో నిరుద్యోగ యువతకి ఉచిత శిక్షణ ఉపకార వేతనం (స్టైపెండ్)తో పాటు ఉద్యోగ అవకాశాలు వున్నాయని అమరరాజ యాజమాన్యం తెలిపింది. అమరరాజా సంస్థ మద్దతుతో రాజన్న ఫౌండేషన్ ఆధ్వర్యంలో 2014లో అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ ని చిత్తూరు జిల్లా పూతలపట్టు మండలం పేటమిట్ట గ్రామంలో స్థాపించారు. ఇప్పటి వరకు ఈ సంస్థ ద్వారా (14 బ్యాచ్ లు) 1314 మంది నిరుద్యోగ యువత తమ ట్రైనింగ్ పూర్తి చేసుకున్నారు. ఇలా ట్రైనింగ్ పూర్తి చేసుకున్న 1314 మందికి అమరరాజ సంస్థలో పర్మినెంట్ ఉద్యోగ అవకాశాలు కల్పించారు. ఇప్పుడు స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో 18 బ్యాచ్ల్లో 1370 మంది నిరుద్యోగ యువత శిక్షణ పొందుతున్నారు. అమర రాజా స్కిల్ డెవలప్మెంట్ సెంటర్ లో 10వ తరగతి పాస్ ఫెయిల్ లేదా ఇంటర్ పాస్ ఫెయిల్ అయిన నిరుద్యోగ యువతి యువకులకి (33వ బ్యాచ్) అడ్మిషన్స్ జరుగుతున్నాయి. ఎంపికైన విద్యార్థులకు శిక్షణా కాలంలో మొదటి 3 నెలలు నెలకు రూ.7500, తర్వాత 21 నెలలు రూ.11453 నుండి రూ.11853 వరకు ఉపకార వేతనం (స్టైపెండ్) ఇవ్వనున్నారు. 33వ బ్యాచ్ అడ్మిషన్లు 26 అక్టోబర్ 2023 నుండి ప్రారంభం అవుతాయన్నారు. నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ ఇతర వివరాల కోసం 9000024919, 9100477371 నెంబర్లను సంప్రదించాలని కోరారు.

దసరా ఉత్సవాల్లో కేంద్ర మంత్రి

ప్రజాశక్తి -రామచంద్రపురం: మండలంలోని సి రామాపురం సమీపంలోని బ్రహ్మర్షి గురూజీ ఆశ్రమంలో జరుగుతున్న దసరా ఉత్సవాల్లో శ్రీకనకదుర్గ దేవి అమ్మవారి సేవలో కేంద్ర పంచాయతీరాజ్, గ్రామీణాభివృద్ధి శాఖ మంత్రి గిరి రాజ్ సింగ్ శనివారం రాత్రి పాల్గొన్నారు. ఉత్సవాల్లో పాల్గొనేందుకు వచ్చిన కేంద్ర మంత్రి గిరి రాజ్ సింగ్కు ఆశ్రమ నిర్వాహకులు రాజేష్, ఆశిష్మెహతా, ప్రకాష్ శేటియాలు మంగళ వాయిద్యాలు, పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ప్రార్థన మందిరంలో దేవి శరన్నవరాత్రుల ఉత్సవాలకు ఏర్పాటు చేసిన కనక దుర్గాదేవి ఉత్సవ విగ్రహాలకు ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురూజి తో కలిసి మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. మంత్రి గిరిరాజ్ సింగ్ కి ఆశ్రమ పీఠాధిపతి బ్రహ్మర్షి గురూజీ ఆశీర్వచనాలు అమ్మవారి తీర్థ ప్రసాదాలను అందజేసి దుశ్శాలువాతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర బిజెపి ప్రధాన కార్యదర్శి జి భాను ప్రకాష్ రెడ్డి, కే హరినాథ్ రెడ్డి, శంకర్ రెడ్డి, జనార్దన్ నాయుడు, భక్తులు విశేషంగా పాల్గొన్నారు.

అఖిలపక్ష సమావేశంలో పాల్గొన్న వివిధ పార్టీల నాయకులు

పట్టణ సమస్యలు పరిష్కరించాలి

- అఖిలపక్ష సమావేశంలో నాయకుల డిమాండు

ప్రజాశక్తి - గూడూరు టౌన్ : పట్టణ సమస్యలు పరిష్కరించాలని అఖిలపక్ష సమావేశంలో నాయకులు డిమాండు చేశారు. గూడూరు సిపిఎం కార్యాలయంలో అఖిలపక్షం ఆధ్వర్యంలో నాయకులు శనివారం సమావేశం నిర్వహించారు. గూడూరు పట్టణ సమస్యలపై వారు చర్చించారు. ఈ సందర్భంగా సిపిఎం సెంట్రల్ శాఖ కార్యదర్శి జోగి శివకుమార్ మాట్లాడుతూ గూడూరు ఒకటవ, రెండో పట్టణాన్ని కలుపుతూ నిర్మాణం చేపట్టిన రైల్వే ఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు త్వరితగతిన పూర్తి చేయాలని, గూడూరు రైల్వే జంక్షన్ లో ఒకటో పట్టణాన్ని రెండవ పట్టణాన్ని కలుపుతూ రైల్వే ఫుట్ ఓవర్ వంతెనను ప్రజలు వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని కోరారు. పట్టణ పరిధిలో సులబ్ కాంప్లెక్స్ ప్రజలకు సేవలు అందించేందుకు చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు పట్టణ కార్యదర్శి సురేష్, కెవిపిఎస్ పట్టణ నాయకులు అడపాల ప్రసాద్, సిపిఐ పట్టణ కార్యదర్శి కాలేషా, టిడిపి పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు, జనసేన పట్టణ అధ్యక్షుడు ఇంద్ర వర్ధన్, వామ పక్షాల నాయకులు పాల్గొన్నారు.

పరమేశ్వర మంగళం పాఠశాలకు విరాళం

పాఠశాలకు చెక్కును అందిస్తున్న విశాంత్ర ఉపాధ్యాయుడు రామకృష్ణ

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : రూరల్ మండల పరిధిలోని పరమేశ్వర మంగళం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు రమాదేవి ఆరవ వర్ధంతి సందర్భంగా 2022-23 సంవత్సరంలో 10వతరగతి లో ప్రథమ, ద్వితీయ స్థానంలో ఉత్తీర్ణులైన వజేశ్వని, ప్రథమం మోనిక, ద్వితీయ స్థానం పొందిన విద్యార్థులకు రూ. 2వేలు, పాఠశాలకు రూ.17 వేలు జాతీయ నాయకుల చిత్ర పటాలకు వితరణగా పాఠశాల ప్రధానోపాధ్యాయురాలుకు రమాదేవి భర్త విశ్రాంత ఉపాధ్యాయుడు వి రామకృష్ణ చెక్కును అందించారు. ఈ కార్యక్రమంలో వారి కుటుంబ సభ్యులు ఆర్. భాస్కర్ నాయుడు, ఆర్ శంకర్ నాయుడు, రమేష్, నిర్మల, పాఠశాల ఉపాధ్యాయిని ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

'బాబుతో నేను' గోడ పత్రికల ఆవిష్కరణ

ప్రజాశక్తి - గూడూరు రూరల్ : గూడూరు పట్టణంలోని రాజరాజేశ్వరి అమ్మవారి దేవాలయంలో టిడిపి మహిళా విభాగం ఆధ్వర్యంలో నాయకులు శనివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు బాబుతో నేను గోడపత్రికలు ఆవిష్కరించారు. ఈ సందర్భంగా టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తిరుపతి పార్లమెంట్ టిడిపి మహిళా విభాగం ప్రధాన కార్యదర్శి శ్రావణి రెడ్డి మాట్లాడుతూ 14 సంవత్సరాలు ముఖ్యమంత్రిగా పనిచేసిన చంద్రబాబుకు జైలులో సరైన వసతులు కల్పించడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. ఆయన జైలునుండి త్వరగా రావాలని కోరుకుంటున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు లీలావతి పాల్గొన్నారు.

గోడ పత్రికను ఆవిష్కరిస్తున్న టిడిపి నాయకులు

ఎస్వీయూ ఓఆర్ఐ విశ్రాంత ఉద్యోగులకు సన్మానం

ప్రజాశక్తి - క్యాంపస్: ఎస్వీయూ ప్రాచ్య పరిశోధన సంస్థలో సుదీర్ఘ కాలం పనిచేసి ఉద్యోగ విరమణ పొందిన, యన్యంఆర్ గా పనిచేస్తూ టీచర్ పోస్ట్ పొందిన ఉద్యోగులు ముగ్గురిని డైరెక్టర్ డాక్టరు పిసి వెంకటేశ్వర్లు శనివారం ఘనంగా సత్కరించారు. క్లర్క్, టైపిస్టు గా 25 సంవత్సరాలు సంస్థకు సేవలందించిన గంగా సువర్ణ , రీసెర్చి అసిస్టెంట్ గా 24 సంవత్సరాలు సేవలందించిన డాక్టరు ఇ గురుమూర్తి మంచి నడవడికతో, నిబద్ధతో పనిచేశారని, 1998 డియస్సీలో క్వాలిఫైతో ఇటీవల ప్రభుత్వ టీచర్ గా ఉద్యోగంలో చేరిన పద్మజ స్కానింగ్ , డిజిటలైజేషన్ నేర్పరితనంతో చేశారని వారి సేవలకు గుర్తుగా చిరు సన్మానం చేశామన్నారు. ఈ కార్యక్రమంలో డాక్టరు రాజశేఖర్, డా. వెంటేశన్, డాక్టరు విజయకుమార్, చంద్రశేఖర్, సిద్దయ్య, నాగరాజు, శోభన్ బాబు, బాషా, రమేష్ రెడ్డి, విశ్వనాథ రెడ్డి, యోగీశ్వరరావు, సంతోష్ పాల్గొన్నారు.

రిటైర్డు ఉద్యోగులను సన్మానిస్తున్న, ఎస్వియు ప్రాచ్య పరిశోధన సంస్థ డైరెక్టరు

30 నుండి గ్రామీణ ఉత్పత్తుల ఎగ్జిబిషన్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: రాష్ట్ర స్థాయి ఖాదీ, గ్రామీణ ఉత్పత్తుల ప్రోత్సాహంలో భాగంగా తిరుపతి అంకాలమ్మ గుడి దగ్గర గల ఎస్ఆర్ కన్వెన్షన్ హాల్లో ఈనెల 30 నుండి నవంబర్ 8వ తేదీ వరకు రాష్ట్రస్థాయి ఎగ్జిబిషన్ ఏర్పాటు చేయనున్నట్లు ఏపీ ఖాదీ, గ్రామీణ ఉత్పత్తుల బోర్డ్ సిఇఓ విజయరాఘవ నాయక్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం ఖాదీ, గ్రామీణ ఉత్పత్తులకు చేయూతనిచ్చే ప్రోత్సాహంలో భాగంగా తిరుపతిలో రాష్ట్ర చేనేత, జౌళి, పరిశ్రమలశాఖ మంత్రి గుడివాడ అమర్నాద్ ఈనెల తేది 30న ప్రారంభించనున్నారని, నగర ప్రజలు పాల్గొని మన సంస్కృతి, సంప్రదాయాల వస్తువులకు సహకారం అందించాలని కోరారు.

పేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యం: ఎమ్మెల్యే

ప్రజాశక్తి-నాయుడుపేట: పేదలందరికీ సంపూర్ణ ఆరోగ్యం అందించాలన్న ధ్యేయంతో ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి జగనన్న ఆరోగ్య సురక్ష ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్నారని సూళ్లూరుపేట ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య పేర్కొన్నారు. నాయుడుపేట మండలం కల్లిపేడు సచివాలయంలో వైసిపి తిరుపతి జిల్లా కార్యదర్శి ఓట్టూరు కిషోర్ యాదవ్ ఆధ్వర్యంలో శనివారం జగనన్న ఆరోగ్య సురక్షను ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పేద ప్రజలకు మెరుగైన వైద్యం అందించాలన్న దృఢ సంకల్పంతో జగన్ మోహన్ రెడ్డి ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష, ఫ్యామిలీ డాక్టర్ ను ప్రవేశపెట్టి మెరుగైన వైద్యం అందిస్తున్నారన్నారు. ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరు తీసుకురావాలన్నారు. పేదలకు కార్పొరేట్ తరహాలో ఇంటింటికీ మెరుగైన వైద్యం అందించాలన్న సంకల్పంతో ఈ కార్యక్రమం ప్రవేశపెట్టారన్నారు. నిత్యం ప్రజల కోసం పరితపించే ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి మాత్రమే అన్నారు. అనంతరం వైద్య సిబ్బంది ప్రజలకు వివిధ రకాల పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు అందించారు. ఈ కార్యక్రమంలో కల్లిపేడు సర్పంచ్ కుంపటి రత్నమ్మ, నాయుడుపేట మండల కన్వీనర్ తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, మాజీ ఏఎంసీ చైర్మన్ ఓట్టూరు రాధా కిషోర్, వైసిపి నాయకులు ఒట్టురు కిషోర్ యాదవ్, మాజీ ఏఎంసి డైరెక్టర్ నాగిరెడ్డి చంద్రశేఖర్ రెడ్డి, వైసిపి సీనియర్ నాయకులు అత్తికాయల శీనయ్య, ప్రసన్న కుమార్ రెడ్డి పాల్గొన్నారు.

మందులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే సంజీవయ్య

మందులు పంపిణీ చేస్తున్న పోణకా దేవసేనమ్మ

గూడూరు టౌన్ : జగనన్న ఆరోగ్య సురక్షను ప్రజలం దరికీ ఎంతో ఉపయోగ కరంగా ఉంటుందని ఈ కార్యక్రమాన్ని ప్రజలు సద్విని యోగం చేసుకోవాలని స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పోణకా దేవసేనమ్మ తెలిపారు. గూడూరు పట్టణంలోని హైస్కూల్ రోడ్డులోని సీఎస్ఎం ఉన్నత పాఠశాలలో జగనన్న ఆరోగ్య సురక్షను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా స్వచ్ఛ ఆంధ్ర చైర్పర్సన్ పోణకా దేవసేనమ్మ హాజరయ్యారు. ఆమెకు అధికారులు, సిబ్బంది ఘన స్వాగతం పలికారు. ఆరోగ్య సురక్షలో ఏర్పాటు చేసిన స్టాల్స్ను దేవసేనమ్మ పరిశీలించారు. వైద్యులతో మాట్లాడారు. రోగులకు డాక్టర్లు వైద్యసేవలు అందించారు. అనంతరం మందులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో స్వచ్ఛ ఆంధ్ర చైర్ పర్సన్ పొణకా దేవసేనమ్మ మాట్లాడుతూ జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవావాలన్నారు. ఈ కార్యక్రమంలో పురపాలక కమిషనర్ వెంకటేశ్వరరావు, నాయకులు రాఘవరెడ్డి, అన్నం మురళి, కోదండ రామయ్య, గోపాల్ యాదవ్, సురేష్ రెడ్డి, సాయి, ఇమ్రాన్, వైద్యులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య లోపం

- పట్టని మున్సిపల్ అధికారులు
- వాహన చోదకులకు ఇబ్బందులు

ప్రజాశక్తి - పుత్తూరు టౌన్ : కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు స్వచ్ఛ భారత్ మిషన్ ద్వారా ఆంధ్రప్రదేశ్లో అన్నిచోట్ల పరిసరాలు పరిశుభ్రం చేయాలని ప్రభుత్వం ఆదేశిస్తున్నా పుత్తూరు పట్టణంలో స్థానిక కార్వేటి నగరం రోడ్డు మండపం సమీపంలోని రోడ్డుపై డ్రైనేజీ నీళ్లు కాలువలో వెళ్లకుండా మురుగునీరు, చెత్త మట్టి చేరడంతో డ్రైనేజీ నీరు కాలువలో వెళ్లకుండా రోడ్డుపై ప్రవహిస్తోంది. వాటి ద్వారా వాహన దారులు వెళుతున్న సమయంలో జారి కిందపడి ప్రమాదానికి గురవుతున్నారని అంతే కాకుండా కుళ్లిన వాస పీలుస్తూ వ్యాధుల బారిన పడుతున్నారు. దోమలు వ్యాపించడంతో విష జ్వరాలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. ఇప్పటికైనా సంబంధిత మున్సిపల్ అధికారులు స్పందించి కాలువలో కూరుకుపోయిన మట్టి, చెత్తను తొలగించి పారిశుద్ధ్యాన్ని మెరుగు పరచాలని లేని పక్షంలో చుట్టుపక్కల ప్రాంతాలలో నివసిస్తున్న ప్రజలు కలిసికట్టుగా మున్సిపల్ కార్యాలయం ఎదుట నిరసన చేపడుతామని ప్రజలు హెచ్చరించారు.

చంద్రబాబుపై అభాండాలు బాధాకరం

-బొజ్జల బృందమ్మ

ప్రజాశక్తి-శ్రీకాళహస్తి: టీడీపీ జాతీయ అధ్యక్షులు చంద్రబాబు నాయుడుపై అవినీతి అభాండాలు వేయడం బాధాకరమని మాజీ మంత్రి బొజ్జల గోపాలకృష్ణారెడ్డి సతీమణి బొజ్జల బృందమ్మ ఆవేదన వ్యక్తం చేశారు. శ్రీకాళహస్తి పురపాలక సంఘం పరిధిలోని 8వ వార్డులో శనివారం 'బాబుతో నేను' కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా తెలుగు మహిళలు అందరూ పసుపు చీర ధరించి బహదూర్ పేటలోని నల్లగంగమ్మ ఆలయంలో ప్రత్యేక పూజలు చేశారు. చంద్రబాబు నాయుడు జైలు నుంచి త్వరగా విడుదల కావాలని నల్లగంగమ్మ అమ్మవారిని వేడుకున్నారు. అనంతరం బొజ్జల బృందమ్మ మీడియాతో మాట్లాడారు. తన భర్త బొజ్జల గోపాల కృష్ణారెడ్డి, టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు మంచి మిత్రులు అన్నారు. చంద్రబాబు నాయుడు ఏనాడూ అవినీతికి పాల్పడ లేదన్నారు. చంద్రబాబు ఆరోగ్యం బాగా లేదనీ, ఆయన అవినీతి పరుడు కాదనీ, అయినా అక్రమ కేసులు పెట్టి జైలుకు పంపారని బొజ్జల బృందమ్మ అన్నారు. టీడీపీకి ప్రజల్లో వస్తున్న ఆదరణను చూసి ఓర్చుకోలేక ఇలా అక్రమ కేసులు పెడుతున్నా రన్నారు. తనపై, తన కోడలు బొజ్జల రిషితారెడ్డి కూడా అక్రమ కేసులు పెడతారేమోనని బొజ్జల బృందమ్మ అనుమానం వ్యక్తం చేశారు. అక్రమ కేసులు పెట్టినా ఎదుర్కోవడానికి తాము సిద్ధంగా ఉన్నామన్నారు.

రోడ్డు పనులు పూర్తి చేయండి : కమిషనర్

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: నగరంలోని టిటిడి పరిపాలనా భవనం పక్కన నిర్మిస్తున్న రోడ్డు నిర్మాణ పనులు త్వరగా పూర్తి చేయాలని నగరపాలక సంస్థ కమిషనర్ హరిత అధికారులను ఆదేశించారు. స్థానిక భవానీనగర్ వద్ద గల టిటిడి పరిపాలనా భవనం పక్కన కాలువపై ఏర్పాటు చేస్తున్న రోడ్డు నిర్మాణ పనులను శనివారం ఇంజనీరింగ్ అధికారులతో కలసి కమిషనర్ పరిశీలించారు. పనులు ఆలస్యం చేయడం పట్ల కమిషనర్ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎప్పుడు రద్దీగా ఉండే ఈ మార్గంలో పనులు సకాలంలో పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. మనుషులను ఎక్కువ మందిని పెట్టి పనులు పూర్తి చేయాలన్నారు. నీరు ఒక పక్కగా వెళ్లేలా చేసి కాలువపై స్లాబ్ వేసే పనులు పూర్తి చేయాలన్నారు. ఈ మార్గంలో నివాసాలు ఉన్నవారు రాకపోకలకు ఇబ్బంది పడుతున్నారని అధికారులు ప్రతిరోజు పర్యవేక్షణ చేసి పనులు త్వరగా పూర్తిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ రోడ్డు నిర్మాణం ఎంత త్వరగా పూర్తి చేస్తే అంత మంచిదన్నారు. కమిషనర్ వెంట సూపరింటెండెంట్ ఇంజినీర్ మోహన్, మునిసిపల్ ఇంజినీర్ వెంకట్రామి రెడ్డి, డీఈ విజయ కుమార్ రెడ్డి ఉన్నారు.

అభివృద్ధి పనులు పరిశీలిస్తున్న కమిషనర్ హరిత

బిఎస్ఎన్ఎల్ 4జి పనులు త్వరగా పూర్తిచేయండి

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: 4జి పనులను త్వరగా పూర్తి చేయాలని చిత్తూరు ఎంపీ రెడ్డప్ప కోరారు. శనివారం స్థానిక బిఎస్ఎన్ఎల్ కార్యాలయంలో టెలికాం అడ్వైజరీ కమిటీ సమావేశం ప్రిన్సిపాల్ జనరల్ మేనేజర్ కార్యాలయంలో జరిగింది. ఈ సమావేశంకు తిరుపతి ఎంపీ డాక్టర్ గురుమూర్తి, రాజంపేట ఎంపీ మిథున్ రెడ్డి హాజరు కావాల్సి ఉండగా వారు ఇతర కార్యక్రమాల్లో ఉండడం వల్ల చిత్తూరు ఎంపీ రెడ్డప్ప హాజరయ్యారు. ఈసందర్భంగా రెడ్డప్ప మాట్లాడుతూ బిఎస్ఎన్ఎల్ సేవలు అంతరాయం లేకుండా అందించాలని చెప్పారు. 3జి టవర్లు ఉన్న చోట 4జి టవర్లను తక్షణమే ఏర్పాటు చేయాలని కోరారు. మారుమూల ప్రాంతాల్లో బిఎస్ఎన్ఎల్ సేవలు ఇబ్బందులు కలుగకుండా చూడాలన్నారు. ప్రిన్సిపల్ జనరల్ మేనేజర్ సి.అమరేంద్ర రెడ్డి మాట్లాడుతూ ఉమ్మడి చిత్తూరు జిల్లాలో 113 4జి టవర్లను ఆమోదించామని చెప్పారు. వచ్చే ఏడాది మార్చి లోపు పూర్తి చేస్తామని వెల్లడించారు. ఈకార్యక్రమం ఆత్మ నిర్భల్ ప్రాజెక్టు కింద చేపడుతున్నట్టు తెలిపారు. అనంతరం చిత్తూరు ఎంపీ రెడ్డప్పని సత్కరించారు.

రాష్ట్రాభివృద్ధికి జగన్ కృషి

ఎం నరసింహారెడ్డి

ప్రజాశక్తి- తిరుపతి సిటి: రాష్ట్ర విభజన తర్వాత ఆర్థిక ఇబ్బందులతో పాటు రాష్ట్రంలో అనేక ఇబ్బందులున్న ఆంధ్రప్రదేశ్ను అభివృద్ధి పథంలో నడిపేందుకు ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి కృషి చేస్తున్నారని టిటిడి స్పెషల్ క్లాస్ కాంట్రాక్టరు ఎం.నరసింహారెడ్డి తెలిపారు. 'ప్రజాశక్తి'తో ఆయన మాట్లాడుతూ రాష్ట్రం ఆర్థిక ఇబ్బందుల్లో కొట్టుమిట్టాడుతున్న సామాన్యుల సమస్యలను పరిష్కరించాలనే ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి అనేక సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టారన్నారు. కుల, మత, ప్రాంతాలకు అతీతంగా ప్రతి ఒకరికి ప్రభుత్వ పథకాలను అందిస్తున్నారని తెలిపారు. ఇంటికి దీపం ఇల్లాలే అన్న నానుడిని దృష్టిలో ఉంచుకుని మహిళల సాధికారితలో భాగంగా అనేక పథకాలను నేరుగా మహిళలకు చేరేవిధంగా చర్యలు తీసుకున్నారన్నారు. వాలంటరీ వ్యవస్థ ద్వారా ప్రతి ఒక్కరికి ముంగిటకు ప్రభుత్వ పథకాలను, సేవలను తీసుకెళ్లుతున్నారని పేర్కొన్నారు. ఆయన ముందు ఆలోచనలో భాగంగానే విద్యా, వైద్యాభివృద్ధిని దృష్టిలో ఉంచుకుని ప్రభుత్వ రంగానికి చెందిన వైద్యశాలలను, విద్యాసంస్థలను అభివృద్ధి చేసేందుకు పూనుకుని విజయం సాధించారన్నారు. ముఖ్యమంత్రి జగన్మోహన్రెడ్డి ప్రభుత్వ ఆసు పత్రులను బలోపేతం చేసి, అనేక మందులను, చికిత్సలను సామా న్యులు, పేదలు, నిరుపేదలకు అదు బాటులోకి తీసుకొచ్చారని, ఈ నేపథ్యంలో కరోనా వంటి ప్రమాదకర వైరస్ మహ్మారిని కూడా రాష్ట్రం ధైర్యంగా ఎదుర్కొందని తెలిపారు. టిటిడి అభివృద్ధికి నిరంతరం కృషి చేస్తున్న ఎంఎల్ఏలు భూమన కరుణాకర్రెడ్డి, డాక్టరు చెవిరెడ్డి భాస్కర్రెడ్డికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. దేవస్థానంలో దళారీ వ్యవస్థను రూపు మాపి, సామాన్య భక్తులకు శ్రీవారిని చేరువ చేసేందుకు నిరంతరం కృషి చేస్తున్న టిటిడి ఈవో ఎవి.ధర్మారెడ్డి కృషిని కొనియాడారు. టిటిడి అధికారులు, సిబ్బంది మొత్తం భక్తుల సేవలో అంకితమయ్యేలా ప్రోత్సహిస్తున్న చైర్మన్ భూమన కరుణాకర్రెడ్డికి ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

చెకుముకి సైన్సు సంబరాలు

ప్రజాశక్తి- తిరుపతి టౌన్: చెకుముకి సైన్సు సంబరాల కార్యక్రమంలో హైస్కూల్ విద్యార్థులు పాల్గొని భాగస్వాములు కావాలని జన విజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు జంగయ్య పిలుపునిచ్చారు. శనివారం జనవిజ్ఞాన జిల్లా కమిటీ సమావేశం యుటిఎఫ్ కార్యాలయంలో నిర్వహించారు. ఈసందర్భంగా చెంగయ్య ముఖ్య కార్యక్రమాల గురించి చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్రవ్యాప్తంగా జెవివి ఆధ్వర్యంలో చెకుముకి కార్యక్రమాలు జరుగుతున్నాయన్నారు. నవంబర్ 10వ తేదీ హైస్కూల్స్ స్థాయి విద్యార్థులు, మండల స్థాయి విద్యార్థులు, డిసెంబర్ 17న సైన్సు టాలెంట్ పరీక్షలు జరుగుతాయని చెప్పారు. పాఠశాల ప్రధానోపాధ్యాయులతో పాటు ఉపాధ్యా యులు విద్యార్థుల తల్లిదండ్రులు సహకరించాలని కోరారు. జెవివి జిల్లా ప్రధాన కార్యదర్శి రెడ్డప్ప మాట్లాడుతూ సైన్సు పట్ల విద్యార్థులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. దేశ అభివద్ధికి సైన్సు ఎంతో కీలకమని చెప్పారు. కార్యక్రమంలో జెవివి నాయకులు షరీఫ్, పీవీ రమణయ్య, ఊహ సంపత్ కుమార్, రఫీ, జయశ్రీ, ఓవి రమణ, జ్యోతి శరవన్, ఎన్వి రమణయ్య, ఇమామ్, కుప్పస్వామి, ఇంజనీరింగ్ విద్యార్థులు ప్రశాంత్, పవన్, సాఫ్ట్వేర్ ఇంజనీర్ మాధురి పాల్గొన్నారు.